క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠ వాల్‌పోస్టర్ విడుదల



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ రూరల్: మండల పరిధిలోని తుజాల్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 8, 9, 10 తేదీల్లో చేపడుతున్నారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆవిష్కరించారు. 8న గణపతి పూజ, 9న దేవత పూజ, మూలమంత్ర అనుష్ఠానం, 10న యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, 11న బోనాల ఊరేగింపు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాలి శ్రీరాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామ్లతండాలో ఘనంగా బోనాలు



బోనాలతో గిరిజనులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని సామ్ల తండాలో ఆదివారం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్, జగదంబ అమ్మవారికి తండావాసులు ఘనంగా బోనాలను ఊరేగించి మొక్కలు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది జూన్ 4న ఆలయంలో ఉత్సవాలు నిర్వహించి దేవతామూర్తులకు బోనాలు సమర్పించామని తండావాసులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని అంశాన్‌పల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ జహంగీర్‌కు వైద్య ఖర్చుల కింద ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదివారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రూ.36 వేల చెక్కును అందజేసినట్లు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. నిరుపేదల కేసీఆర్ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థికంగా ఆదుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.-


కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



జొన్నలను తూకం వేస్తున్న దృశ్యం

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన వరిధాన్యం, జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ రవీందర్ ఆదివారం అన్నారు. పెద్దశంకరంపేట, జంబికుంట, రామోజిపల్లి, వీరోజిపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 41,282 క్వింటాళ్ల వరిధాన్యం, పేటలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంలో 1,256 క్వింటాళ్ల జొన్నలను ఇప్పటి వరకు కొనుగోలు చేశామని ఆయన తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు.

కొనసాగుతున్న బడిబాట



బడిబాటలో ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండలంలో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం రెండో రోజు పేటలోని ప్రభుత్వ ప్రాథమిక, బాలికల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సదుపాయాలపై వివరించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మారుతి, జనార్దన్, ఉపాధ్యాయులు రామకృష్ణాగౌడ్, సంతోశ్, సిద్ధిరాములు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



కొల్చారం మండలంలో ..



చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్‌లో ..



అల్లాదుర్గంలో..

ఘనంగా ఏరువాక పౌర్ణమి

అల్లాదుర్గం(మెదక్): మండలంలో ఆదివారం రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ, చిల్వెర, అల్లాదుర్గం, మాందాపూర్, చెవేళ్ల రైతులు ఎద్దులను రంగు రంగులతో అలంకరించారు. రైతులు డబ్బు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి స్థానిక దేవాలయం చుట్టు ప్రదీక్షణలు చేశారు.
చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని అజ్జమర్రి, చండూర్ గ్రామాల్లో రైతులు ఏరువాక ఉత్సవాలు జరుపుకున్నారు.
టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామ దేవతలైనా దుర్గమ్మ, పోచమ్మలకు బండ్లను ఊరేగించారు.
కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా రైతులు ఏరువాక సంబరాలను నిరాడంబరంగా జరుపుకున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో ధాన్యం కొనుగోల్లు పూర్తిస్థాయిలో జరగకపోవడం పండగలో మునుపటి ఉత్సాహం కనిపించలేదు. 9గ్రామ పరిసరాల్లోని పొలాల వద్దకు తీసుకెళ్లి పశువులతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.
పెద్దశంకరంపేట(మెదక్): పేటతో పాటు రామోజిపల్లి, కోళాపల్లి, జూకల్, మల్కాపూర్ తదితర గ్రామాల్లో రైతులు తమ పశువులను అందంగా అలంకరించి ఆలయాల చుట్టూ ఊరేగించారు.
రేగోడ్(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి పండుగను రైతులు, ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మర్పల్లిలో ఎడ్లను రంగురంగులతో అలంకరించి హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.



రేగోడ్(మెదక్): హనుమాన్ ఆలయం చుట్టూ ఎడ్లతో ప్రదక్షిణలు చేస్తున్న రైతులు



పెద్దశంకరంపేట(మెదక్): పశువుల అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు

క్రీడలు యువతకు ఎంతో అవసరం



యువకులకు టీషర్ట్‌లను అందజేస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): యువతకు చదువుతో పాటు, క్రీడలు అవసరమని మండల బీఆర్‌ఎస్ నాయకులు శివ్వగొని పెంటాగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన 110 మంది యువకులకు రూ. 55 వేల సొంత ఖర్చుతో టీషర్ట్‌లను ఇప్పించాడు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో విద్యార్థులంతా ఒకచోట కలిసి గత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994 – 95 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు నర్సాపూర్ పట్టణ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలల్లో చదివి తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి వారి కష్టసుఖాలను పంచుకోవడం ఎంతో సంతోషం అన్నారు. కుటుంబ సభ్యులతో వచ్చి ఉపాధ్యాయులకు పరిచయం చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జైశీల, సులోచన, ధన్‌సింగ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో గొప్పది



రక్తదానం చేస్తున్న దాత

మెదక్ మున్సిపాలిటీ: అన్ని దానాల్లో కంటే రక్తదానం ఎంతో గొప్పదని శ్రీ సత్యసాయి సేవా సమితి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ శ్రీవాండ్ల సాయిబాబా అన్నారు. ఆదివారం పట్టణంలోని సత్యసాయి మందిరంలో ముక్క సుశీలమ్మ, కృష్ణమూర్తి స్మారక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తదానం విషయంలో అపోహ అవసరం లేదని, ఆరోగ్యంగా ఉన్న వారు ఎవరైనా రక్తదానం చేయొచ్చని అన్నారు. పాలిటెక్నిక్ సీనియర్ లెక్చరర్ పండిత్ రావు మాట్లాడుతూ.. ముక్క సుశీలమ్మ, కృష్ణ మూర్తి స్మారకర్థం వారి కుమారుడు ముక్క సుధాకర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసి ఎన్నో ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు, చదువుతో పాటు, క్రీడలు, సంస్కృతిక అంశాల్లో ప్రావీణ్యం సాధించిన సరస్వతీ శిశుమందిర్ విద్యార్థికి డైట్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, బంగారు పతకాలు అందజేశారు. అలాగే ప్రభుత్వ బాలికల పాఠశాల, సరస్వతీ శిశు మందిర్, బాలవికాస్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మేరు సంఘం నాయకులు

కొల్చారం(నర్సాపూర్): కుల వృత్తులను ఆదుకోవాలని సీఎం కేసీఆర్ నిర్ణయం అని అందులో మేరు(దర్జీ) కులస్తులకు రూ. లక్ష రుణం ఇచ్చేందుకు సీఎం అంగీకరించడంపై ఆదివారం మండల పరిధిలోని రంగంపేటలో మండల మేరు ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల, గ్రామ మేరు సంఘం నాయకులు రాజు, రాధాకృష్ణ, పాండు, భిక్షపతి, ఆనంద్, నరేశ్, గంగారాం, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యలను పట్టించుకోని ప్రభుత్వం

కొండాపూర్ ఎంపీటీసీ శ్రీకాంత్ నాయక్

రేగోడ్(మెదక్): తొమ్మిదేళ్లుగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కొండాపూర్ ఎంపీటీసీ శ్రీకాంత్ నాయక్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అనేక మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ తొమ్మిదేళ్ల కాలంలో నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారం 7,007 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్న రిపోర్ట్ రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి సూచికగా నిలుస్తుందని తెలిపారు. ఈ రిపోర్ట్ కాకుండా మరెందరో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. వ్యవసాయ రంగానికి సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల ఆత్మహత్యలు జరుగుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు ఆత్మహత్యల నివారణ కోసం అనేక చర్యలు చేపట్టిందన్నారు.

చలో మెదక్ విజయవంతం చేయాలి

చేగుంట(తూప్రాన్): హలో ముదిరాజ్ చలో మెదక్ కార్యక్రమం విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం మండల శాఖ అధ్యక్షుడు మ్యాకల పరమేశ్ అన్నారు. ఆదివారం బోనాల్ గ్రామంలో ముదిరాజ్‌ల చలో మెదక్ కరపత్రం ఆవిష్కరించారు. సోమవారం మెదక్‌లో జరిగే ముదిరాజ్ భవన శంకుస్థాపనకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య, ముదిరాజ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కనకయ్య, యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

శివ్వంపేట(నర్సాపూర్): పేద కుటుంబానికి చెందిన వ్యక్తి మృతి చెందడంతో సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు ఆర్థికసాయం చేశారు. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన చాకలి చింటూ అదివారం మృతి చెందాడు. సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ రూ.5 వేలు, వార్డు సభ్యుడు సదానంద్ రూ.5 వేలు, గ్రామస్తుడు పెంజర్ల నర్సింలు రూ.2 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

70 రోజులకు చేరిన దీక్షలు

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 70 రోజులకు చేరుకున్నాయి. దీక్షలు చేస్తున్నా అధికార పార్టీ నాయకులు ఎంతమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయమని అఖిలపక్షం ప్రతినిధులు పోచమ్మల అశ్విని వాపోయారు.

మల్కాపూర్‌లో కొనసాగుతున్న స్వచ్ఛభారత్



తూప్రాన్: మల్కాపూర్‌లో చెత్తను తొలగిస్తున్న గ్రామస్తులు



మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో..

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ప్రతీ ఆదివారం నిర్వహించే స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని 6వ వార్డులోని దుర్గామాత ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలను, సీసీరోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. అలాగే చెట్లకు పాదులు చేశారు. గ్రామంలో ఇప్పటి వరకు నిరంతరాయంగా 362 వారాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, మేకిన్ యువత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పంజాల వెంకటమ్మ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.
మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యువత ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. 268వ వారంలో భాగంగా హరిత వనంలో స్వచ్ఛభారత్ నిర్వహించి చెట్ల వద్ద పేరుకు పోయిన పాదులను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలకు నీటిని పట్టారు. చెత్త చెదారాన్ని డంప్‌యార్డులకు తరలించారు.

వైభవంగా లలితా పరమేశ్వరీ ఆలయ వార్షికోత్సవం

1022వ చండీయాగం



లలిత పరమేశ్వరీదేవి ఆలయంలో చండీయాగం నిర్వహిస్తున్న రుత్వికులు

తూప్రాన్: పట్టణ పరిధిలోని వెంకటాపూర్ గ్రామ సమీపంలోని లలితా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం పంచమ వార్షికోత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు, సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, మహాపూజ, 1022వ చండీయాగం, మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం, అమ్మవారి ఆశీస్సులతో జన్మించిన చిన్నారులకు తు లాభారం తదితర కార్యక్రమాలు ఘనంగా జరిపించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు.

ఈదురు గాలులకు అతలాకుతలం



కాజీపేటలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్



కాజీపేటలో జుర్రు పోచమ్మకు చెందిన ధ్వంసమైన ఇల్లు

- ధ్వంసమైన రేకుల ఇళ్లు, పౌల్ట్రీ షెడ్లు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

నర్సాపూర్ రూరల్: ఈదురు గాలులతో కూడిన వర్షానికి నర్సాపూర్ మండలంలోని కాజీపేటలో పలువురి రేకుల ఇళ్లు, పౌల్ట్రీ షెడ్లు ధ్వంసం కావడంతో పాటు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. ఆదివారం మధ్యాహ్నం ఈదురుగాలితో కూడిన వర్షం కురిసింది. దీంతో మల్లన్న గుడి నుంచి గ్రామం వరకు నిర్వహిస్తానని, 11 కేవీ విద్యుత్ స్తంభాలు 20, ఎల్‌టీ లైన్ స్తంభాలు 20, రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు స్తంభాలు నెలకొరిగాయి. దీంతో పాటు జుర్రు పోచమ్మ, జుర్రు సాయిలుతో పాటు పలువురి రేకుల పెంకుటి ఇళ్లు ధ్వంసం అయ్యాయి. పౌల్ట్రీ షెడ్లు రేకులు లేచిపోయాయి. ప్రస్తుతం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తాగు నీటి సమస్య, అంధకారంలో ఉండే పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల్లో లారీలు రాకపోవడంతో కాజీపేట, మంతూర్ గ్రామాల్లో ధాన్యం బస్తాలు తడిచి ముద్దయ్యాయి.

పేటలో వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో పాటు వర్షం కురవడంతో రహదారులన్ని చిత్తడిగా మారాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం అమ్ముకానికి తెచ్చిన రైతులు అకాల వర్షానికి ఇబ్బంది పడ్డారు. ఆదివారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది.

ఆలయాల్లో భక్తుల పూజలు



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు



తూప్రాన్: మల్కాపూర్‌లో ..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిటుకల్ శివారులోని మంజీరా తీరంలో వెలసిన చాముండేశ్వరీ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పక్కనే ఉన్న మంజీరా నదిలో భక్తుల స్నానం ఆచరించి, భక్తులు అమ్మవారిని దర్శంచుకొని మొక్కులు తీర్చుకున్నారు.
కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులతో రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.
తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం దుర్గామాత సేవాసమితి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఉప సర్పంచ్ ఆంజనేయులుగౌడ్ ఘనంగా సన్మానించారు.
చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని వాసవీ కన్యక పరమేశ్వరీ ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమాల్లో దుబ్బాక కాంగ్రెస్ నియోకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, నిర్వాహకులు హన్మయ్య, నగేష్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

పగిలిన భగీరథ పైపులైన్

వృథాగా పోతున్న నీరు



చిల్వెర రహదారి పక్కన పారుతున్న నీరు

అల్లాదుర్గం(మెదక్): నిత్యం భగీరథ పైపు ఎక్కడో ఒక చోట లీకేజీలు అవుతున్నాయి. అధికారులు పట్టించుకోక పోవడంతో చివరకు పైపు పగిలి వరదలా నీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అల్లాదుర్గం మండలం చిల్వెర ఐబీ చౌరస్తా నుంచి చిల్వెర గ్రామం వరకు ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ పర్యవేక్షణ, మరమ్మతులకు ప్రభుత్వం లక్షలు ఖర్చుపెడుతున్న ఈ నిధులు ఎక్కడ ఖర్చు పెడుతున్నారో తెలియడం లేదు. చిల్వెర గ్రామ శివారులో 161 రహదారి పక్కన పెద్ద పైపు పగిలింది. నీరంత వరదల పారడంతో రైతులు, వెంచర్ నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంచర్ మొత్తం నీటితో నిండిపోయింది.

సంక్షిప్త వార్తలు

- **ట్రాన్స్‌ఫారాన్ని ధ్వంసం చేసిన దుండగులు**

మనోహరాబాద్(తూప్రాన్): వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫారాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని చెట్ల గౌరారం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫారాన్ని ధ్వంసం చేసి, అందులో గల కాపర్‌ను, ఆయిల్ చోరీ చేశారు. ఈ విషయంపై వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, రైతులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

- **కాద్లూర్ సర్పంచ్, కార్యదర్శికి నోటీసులు**

టేక్మాల్(మెదక్): తాగునీటి సమస్య, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండలంలోని కాద్లూర్ గ్రామ సర్పంచ్ యాదయ్య, కార్యదర్శి కీర్తికి నోటీసులు అందినట్లు ఎంపీడీఓ భారతి ఆదివారం అన్నారు. గ్రామ పంచాయతీలో నిధులు ఉన్నా.. పనులు చేపట్టకుండా గ్రామస్తులకు మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న సర్పంచ్ యాదయ్యకు జిల్లా కలెక్టర్, కార్యదర్శి కీర్తికి జిల్లా పంచాయతీ అధికారి నోటీసులు పంపినట్లు తెలిపారు.

- **‘రోడ్డు విస్తరణలో ఆలయాలు కూలిస్తే సహించేదిలేదు’**

మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌లో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆలయాలను కూలిస్తే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హౌజింగ్‌బోర్డు కాలనీ ప్రజలు హెచ్చరించారు. ఆదివారం కౌన్సిలర్ నర్మద, ఆలయ కమిటీ సెక్రెటరి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హౌజింగ్‌బోర్డులోని హనుమాన్ ఆలయం, శివాలయం, సత్యసాయి ఆలయం, నవగ్రహ ఆలయాలను తొలగించేందుకు మార్కింగ్ చేశారన్నారు. ఈ విషయంలో గతంలో కూడా కలెక్టర్, జాతీయ రహదారి నిర్మాణ ఇంజనీర్, ఆర్డీఓ, తహసీల్దార్, ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. మరోసారి ఆలయాల జోలికి వస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

- **మహా ర్యాలీకి తరలిన వీరశైవ లింగాయత్‌లు**

రేగోడ్(మెదక్): వీరశైవ లింగాయత్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మహార్యాలీకి రేగోడ్ మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఆ సంఘం సభ్యులు తరలివెళ్లారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ ఆల్ ఇండియా కమిటీ సభ్యుడు వీరప్ప, నాయకులు ఉన్నారు.

- **‘ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు’**

మెదక్‌జోన్: ప్రభుత్వం ఏం సాధించిందని దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే దఫాలో రూ. లక్ష లోపు పంటరుణాలు మాఫీ చేస్తామని రైతులను మోసం చేయనందుకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారా..? లేక అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్‌డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీని ప్రభుత్వ పరం చేసి తిరిగి నడుపుతామని మాట తప్పినందుకు జరిపిస్తున్నారా అని ప్రశ్నించారు.

- **‘ప్రజలకు న్యాయం దక్కడంలేదు’**

మెదక్‌జోన్: బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు న్యాయం దక్కడంలేదని నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఆదివారం మెదక్ వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో దళితులపై జరిగి దాడిని ప్రశ్నించిన వారిపై, మరియమ్మ మృతి విషయంలో పోలీసులు ప్రదర్శించిన తీరు సరిగా లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రసాద్, నందుజనార్దన్‌రెడ్డి, నందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.